ఎప్పుడెప్పుడు గొడ్డళ్ళ వ్రేట్లు ఆపీవారో, ఫిరంగిమోత ఎప్పు డెప్పుడు చాలించీవారో, అప్పుడప్పుడు ఆ వుడుత ఆగిపోయి కనిపించేదికాదు ఎవరికిన్ని తానెక్కడున్నదీ.

ఈ ఉడుత చావదర్రా అని సార్జంటు, ఈ ఉడుత మనల్ని కొట్టనివ్వదర్రా అని కూలీలు తమలో తాము అనుకొన్నట్లు ఒకరిమొగా లొకళ్లు చూచుకున్నారు. లేదు ఉడుత లేదంటే లేదు అని అనుకొనేవారు. తిరిగి నరుకు అగ్గిముట్టింపు ప్రారంభించేరు. మళ్లీ ఎప్పటి ఆటే ఉడుత! మళ్లి కూలీలు సార్జంటూ విరమించేరు.

ఆదేదో విడ్డూరంగా వుందని ఆబాల గోపాలం ఊరందరూ వచ్చి విరగబడిచూచేరు. చెట్టలా వుండవలసిందేకాని నరకబడ వలసింది కాదన్నారు. జనవాక్యమే కర్తవ్యమై యూరుకుంది.

వెయ్యిగొడ్డళ్లూ మూలబడ్డాయి. ఫిరంగి చల్లారి తుప్పు పట్టింది. కాని చెట్టుమాత్రం ఏటేటా చిగురుపట్టి యింపుగొల్పు తూనే వుంది యిప్పటికిన్నీ. దానిమీది నేటివుడుత—అదేనా? మరొకటా?

## కా రా గృ హ క వా ట ము

"నీవు దొంగచాటుగా నాకు ఇచ్చే ముద్దు నేను తీసికోనూలేను; నేను దొంగచాటుగా నీకు యీ చెట్టుయొక్క పువ్వు కోసియివ్వనూ లేను. నేను ఖైదీని; అస్వతంత్రుణ్ణి."

"నీవు దొరగారి తోటమాలివి కావూ? అస్వతంత్రుడివా?"

"ఈ దొరగారికి తోటమాలీలంటూ వేరేలేరు. దొంగలే తోటమాలీలు."

"ఐతే నీవెప్పుడు మరి విడుదల అయ్యేది?"

"ఎందుకు? నీ కా ఊసు?"

"ఊరికేనే"

"మూడురోజుల్లో"

"ఈ రోజు కలిసా?"

"ఊఁ."

"ఊఁ" అని ఖైదీ అన్నాడో లేదో జైల్లో సాయంకాలం నాలుగు కొట్టారు. జైలు సూపరింటెండెంటు దొరవారి బంగాళా ముంగిట పూలతోటయొక్క దక్షిణపు కంచెవార పొగడమొక్కకు నీళ్ళుపోస్తూవున్న ఆ ఖైదీ రెండుకుండలూ పూర్తిగా వంచి నీళ్ల వెలలించినవాడై కావిడి ఉత్తిది ఊపుకుంటూ, తన్ను కంచె ఆవలినుండి పలకరించిన పిల్లవైపు కనుగిలుపుమాత్రంగానైనా చూడకుండా జైలుగంట మార్మోగ్రిత చెవులు దోరెట్టుకు వింటూ, తక్కుంగల ఖైదీ లొక కొందర్ని తనలాంటివార్ని కలిసికొని, తిన్నగా రాజమార్గం దాటుకుంటూ దైనందిన కార్యక్రమాన్ని అనుసరించి జైల్లోకి తరలిపోయినాడు.

ఆ క్షణాన్ని ఆతణ్ణి ఆవరించి అతనినుండి క్రమక్రమంగా జారిపోయినవి అల్లా పిల్లకళ్ళున్ను. ఆ కళ్ళముందు పొగడచెట్టు నుండి పిల్లగాలికి రాలి అతనిమీద అతనికి తెలియకుండా పడ్డ యొక కొన్ని పువ్వులున్ను.

పూల నెవరైనా లెక్క పెట్టారా? పిల్లనెవరైనా కని పెట్టారా? అసలు జైలుకూ బంగాళాకూ దూర మెంత? ఆ దూరంలో రాజమార్గమన్న దెంత? ఇదంతా యెవరైనా ఊహించేరా?

* * * * *

పై సంభాషణ జరిగింది సోమవారం అనుకోండి. సోమ వారం లేదు. మంగళవారంలేదు. బుధవారం పొద్దున్నే జైల్లో అరున్నొకటి కొట్టేసరికల్లా జైలుముందు రాజమార్గంమీద పిల్ల కని పెట్టుక్కూర్చుని వుంది. కొంచెం వారగా మర్రిచెట్టు క్రింద. పల్లెపల్లెలనుంచి పాలు. అపరాలు నెత్తినెట్టుకువచ్చే జనం తెల్లార కుండానే పట్నంలో ప్రవేశించి వుండడంచేతనూ. కొత్తగా జైల్లోకి చేరుకోవలసినవాళ్లు అప్పటికప్పుడే జైలు ఆవరణలోకి గొంపోబడి వుండడం చేతనూ ఆ పరిసరప్రాంతం అంతా నిర్మానుష్యంగా వుంది. మరిన్నీ నిశ్శబ్దంగా వుంది. ఏదన్నా కూస్తే అది గోరింక! ఏదన్నా పలికితే అది చిలక! కోయి లొకటి రావిచెట్టు తుద వ్రాలింది కాని వాయి విప్పనా మాన్నా అని సంకోచిస్తూవుంది. బహుశా గొంతు సవరించుకుంటూ వుందేమో మంచి పాట పాడ్డానికి. ఎందుకు కాకూడదూ? హేమంత ఋతువును. వసంతఋతువును కేటాయించడానికి వీల్లేని దోసందు సుఖవాసరా లవి. కోయిల మరి తన గొంతు చక్కబరచుకోకుండా వుంటుందా? అచిరకాలంలో ఎందుకు పాడకుండా వుంటుందా?

విడుమర గన్న మన ఖైదీ కారాగృహ కవాటం తెరపిని అప్పుడే కనిపిస్తూవున్నాడు. అతని వొంటిని సోమవారంనాడున్న మాదిరి చడ్డీ. బనీను. టోపీ-అన్నీ వొకేరంగు తెల్లటి దుస్తులుగా కనిపించేవి బుధవారం ప్రొద్దున్న లేవు. అత నప్పటికప్పుడే వేసికొన్న దిరీసు అదోరకపు సొంత దిరీసు. కట్టాడు గ్లాస్కో మల్లు పంచె; తొడిగాడు కాసుల బొత్తాముల చొక్కా; చుట్టాడు గులాబిరంగు కోరపాగా; నడుచుకుంటూ వస్తున్నాడు రాచమార్గం కేసి. "అదృష్టవంతుడివి. విడుమరగన్నావు" అని విడివడని ఖైదీలు అభినందించేరు. "ఈ పైనుంచి అయినా బుద్ధిగలిగివుండు"

అని అధికారులు నీతి గరపేరు. ఏదీ అతగానికి అవలోదనం గావడంలేదు. జైల్లోనుంచి అవల పడతానా లేదా అనే ఆందోళనే! ఆవలపడ కేంచేస్తాడు విడివడ్డాక? అతగానికి తోచడంలేదు ఆ ముక్క. తోచడంలేదుకదా. కవాతుచేసేవాళ్ళు 'బెయోనెట్లు' గల తుపాకులు సూర్యరశ్మిలో పైకెత్తినప్పుడు కవాతు చెప్పే యుద్యోగి 'ఎటెన్‌షన్' అని అరచినప్పుడు. మనవాని హృదయం 'హూ' త్తన్నట్టు బెదిరిపోయింది. మనవానికళ్ళు వూద బడ్డట్టు దృష్టి చెదరించుకొనివి. ఇదంతా ఎంతసేపు? పది నిమిషాలు. మనం మనం అతగా డేంనేరం చేసివుంటాడూ. అస లెంతకాలం శిక్షపడ్డాడూ. ఆ యిచ్చింది న్యాయమైన తీర్పేనా అని విమర్శించుకొన్నంతకాలంకూడా పట్టలేదు.

జైలు ఆవరణ దాటుకొచ్చి వొక్కడూ - అ పిల్లయొక్క మనోనాయకుడు అని అందామా?—ఆ అందగాడు రాజమార్గం మీద రాణించాడు.

ఎఱ్ఱని రస్తామీద ఎండ బాగా ప్రసరించివుంది. చెట్లనీడలు తమకు తామే అతనిముందు వొత్తిగిల్లినట్టుగా ఓ వెంపుకు తప్పుకున్నాయి. ప్రకృతికి లోపలా వెలపలాకూడా చాటూమాటూ లేనట్టు అంతా వెల్తురుమయంగా. బంగనబయలుగా అగపిస్తూంది.

తన తెట్టతెన్నునే పిల్లను చూచాడు. పిల్ల పడుచుపిల్ల. ఎంతో సింగారంగా కట్టుకొచ్చిన అకుపచ్చరంగు చీరచెంగు జారు చటుక్కున సర్దుకుంది. ఆ సర్దుకోవడంలో విలాసంగా మెఱయించింది లోతట్టు పట్టంగట్టుకొనియున్న యెదపుట్టువులమీది ఎఱ్ఱ రంగు జంపర్. దాడిమీకోరకమా? బంధూక కందుకమా? సంధ్యా ప్రబందమా?

* * * * *

" ఇప్పుడు నీ వెందు కిక్కడకు వచ్చావు ? "

" ఈవేళ నిన్ను విడిచిపెడతా రన్నావుగా ? "

" అన్నానా ? "

" అన్నావ్."

" అంటే ? "

"ఇప్పుడు నన్ను ప్రేమించడానికి నీకేమిటి అభ్యంతరం?"

" ప్రేమ ? అది ఈ కారాగృహమం దుంచబడకపూర్వ మేమైనా మునుపూ ముందూ ఉండేదేమో నా గుండెల్లో. ఎక్కడన్నా దాగుండి. కనికరించి ఎప్పుడైనా వొకానొక బాటసారిని దోచుకోకుండా విడిచిపుచ్చి వున్నానేమో ? ఇప్పు డది పూర్తిగా నాయందు నమ్మైనది. ప్రేమ ? ప్రేమ ? ప్రేమ ? "

* * * * *

పిల్ల చకితమై కన్ను లప్పకించుకుంటూ తనకొంగున కట్టుకొచ్చిన యొకానొక చిన్న పొగడపూల దండను ఆమాత్రపు పదిపదహారు పువ్వులున్నదాన్ని ముడివిప్పి తీస్తూ గద్గదికగా " మరి, మరి మరి ఈ పూలదండ నెవరిదండ కెక్కించను ? " అని అడిగింది. " ఏ పూలదండ ? " అని అడిగాడు విడివడ్డ ఖైదీ. " ఇదిగో ! ఇదీ ! అరదండాలవంటిది గాదు. ఒక్క నిండుదండ. నీకైంది గుచ్చితెచ్చాను. ఇదిగో ! " అని అతని మణికట్టునుంచిన్నీ అది గమనించబోయింది పడుచు. అత డా మణికట్టు సొంతశరీరపు వెన్నెముకకు హత్తుకుంటూ నిలువునా వీరోచితుడై నివ్వెరపోతూ " ఎక్కడివీ పువ్వులు ? " అని ప్రశ్నించాడు. ఆ కోమలి యిట్లు బదులాడసాగింది: " మొన్న నీవు

నీళ్ళుపోసిన చెట్టువి. ఆ చెట్టు నీమీద తన పువ్వుల్ని విరజిమ్మిందిగా! వాటిని నీవు దారిపొడుగుతా దులుపుకుంటూ నడచిపోతివిగా జైల్లోనికి? రాజమార్గమును దాటుకుంటూ? నేను నీ వెంబడినే వచ్చి, వెంటవెంటనే. నీనుండి రాజమార్గమ్మీద విడివడిన పది పదహారు పువ్వుల్నీ ఏరుకు ఇంటికి గొనిపోయి ఈ ప్రకారంగా దండగ్రుచ్చి తెచ్చాను" అంది అతి అమాయకంగా.

అంటూవున్న పడుచును తప్పుకోమని ఆ నాయకుడు తన నెత్తిమీది కోరసాగాను అట్టె తీసివేసికొన్నవాడై "పిల్లా! నీ మేలు మరువజాల! జ్ఞప్తికి దెచ్చినావే నే పెంచిన మొక్కను! నేను నీళ్లుపోసిన చెట్టును! అది పూచినదా? ఆహా! పూచి నాపైని పూవుల్ని రాల్చినదా? ఆ పువ్వులేనా యివి?" అంటూ ఆదండను తన దోసిటిలో పెట్టుకుని కళ్ళ నద్దుకుంటూ "నాతో చెప్పకుండా నామీద తన కుసుమా లిన్నింటి నభివర్షించిన తరువు నెంతని కొనియాడగలను? దానిని నేను తిరిగి చూడనుగదా? చూడను గదా? అదేనా దానికొమ్మ? అదేనా దాని రెమ్మ? అదేనా? అదేనా?" అని మునివ్రేళ్ళమీద మిక్కిలీ ఎత్తరై ఆ మోకను చూస్తూ వేడి కన్నీళ్ళు విడిచాడు.

ఆ పురుషుణ్ణి ఆ ముహూర్తమందు అనునయింపగలిగింది దగ్గర్లో వున్న తరుణ స్త్రీ కానేకాదు. వాని పొగడచెట్టుమీది కెక్కడినుంచో ఎగిరివచ్చి అప్పుడే వ్రాలి ఆనవాలు గొలుపుతూ పాడిన కొదమ కోయిలయొక్క నిరంతర వియోగగీతి! నిరంతర వియోగగీతి! ఆ నిరంతర వియోగగీతి యొక్కటే ఆ ముహూర్త మందాపురుషున్ని అనునయింపగల్గింది.